


నడిరోడ్డు మీద పెళ్ళాం భుజం మీద చేయి వేసుకు నడవటం- పురోగమిస్తున్న నాగరికతకు చిహ్నమైతే అవ్వవచ్చుగాని సభ్యత మాత్రం కాదు.

నాకయితే చాలా అసహ్యమే

అనిపించింది.

అందునా అలా చేసింది ఎవరో ఎవరోగాదు-నామిత్రుడు చక్రవర్తి, అతగాడి భార్య-ఇద్దరు పిల్లల తల్లి సుజాత.

నేను అదే రాజ్యంతో అన్నప్పుడు నవ్వేసి ఊరుకున్నది.

రాజేశ్వరి నా భార్య.

"ఇది బాగున్న దంటావా?" అన్నాను-దానికి ఒక నవ్వు నవ్వేయటం గాదు సమాధానం అన్నట్లుగా వత్తి పలుకుతూ.

"ఆతగాడు సరదాపడి పెళ్లాం భుజంమీద చేయి వేసుకు తిరిగాడు. అంతేగాని వూళ్ళో ఆడవాళ్ళ మీద చేయివేసుకు తిరగలేదు గదా! మధ్యలో మీ బాధేమిటి? కావాలంటే మీరూ తిరగండి అలా!"

"నువ్వొప్పుకుంటావా?" చాలా సీరియస్‌గా అడిగాను—రాజేశ్వరి మీది మీదికి వెళుతూ.

మరో చిరునవ్వు-నా అరికాలి మంటను నెత్తికెక్కిస్తూ.

బుజ్జిగాడు నిద్ర లేచాడల్లే వుంది. ఉయ్యాలలో ఘొల్లున ఏడుస్తున్నాడు.

"రాజూ! రామిగాడు లేచాడు" అన్నాను కుర్చీలో నుంచి లేవకుండానే.

"కాస్త ఎదురుగ్గా వున్న ఉయ్యాల వూపితే మీ సొమ్మేంపోయింది-ఎక్కడో వంట ఇంట్లో వున్ననాతో ఏడుస్తున్నాడూ అని ఓ దీర్ఘం తీయకపోతే?" అన్నది చిటపటలాడుతూ. కొంగును నడుం చుట్టూ బిగించల్లా ఉయ్యాల దగ్గరకు వచ్చింది.

నేను నవ్వేసి పేపరు చదవటానికి తిరిగి ఉపక్రమించాను.

"ఎవరి డ్యూటీ వారిది!"

మూతిని ముప్పైమూడు వంకర్లు తిప్పింది.

"ఒక సరదాలేదు, పాడూలేదు. పిల్లవాడ్ని ఏడుస్తున్నప్పుడైనా ఎత్తుకోవచ్చు గదా? కాస్త ముఖం కడిగి తల దువ్వి పౌడర్ రాసి ఇస్తాను. నాలుగు రోడ్లు తిప్పుకు రండి!"

పేపర్లోనుంచి తలెత్తకుండానే, "ఉచ్చపోస్తాడేమో అసహ్యంగా" అన్నాను.

"పోస్తే పీడాపోయె. ఆ చొక్కా విప్పేసి ఇంకో చొక్కా తొడుక్కుందురుగాని" అన్నది నవ్వాపుకుంటూ.

"అయ్య బాబోయ్! అలా తడిసిన చొక్కాతో ఇంటికి రావాలా రోడ్లమీద నడుచుకుంటూ?"

"పోసీయ్. వంట నిముషాలలో

పూర్తి చేస్తాను. వెళదాం పదండి ఎటన్నా."

"ఉఁహు.... పేపరు చదివేటప్పటికి ఎలా లేదన్నా ఇంకా అరగంట పడుతుంది. అప్పటికి వెలుతురు పోయి చీకటి వస్తుంది. దానితోటి చల్లటి గాలీ వీస్తుంది. పండుగాడికి జలుబు చేయదా అమ్మా?" అన్నాను తప్పించుకోవాలి అన్నట్లుగా-ఆవిడగారు నీరసించి పోకుండా కాస్త మురిపిస్తూనూ.

కళ్ళు ఒక్కసారి గిరగిరా తిప్పేసి, "అబ్బాయిగార్కి ఆమాత్రం తెలుసన్నమాట. ఇంకేం?" అన్నది.

రాజ్యం నాదయి రెండు సంవత్సరాలయింది.

మా మధ్యకు రాము వచ్చి ఆరు నెలలయింది.

జీవితానికి థ్రిల్లు రోడ్లమ్మట తిరిగితేనే రాదు-ఇంట్లో కూర్చొని పెళ్ళాం బిడ్డలతో కబుర్లు చెప్పుకుంటున్నా వస్తుంది.

తలుపు తట్టిన చప్పుడైంది.

ఎవరా అనుకుంటూ వెళ్ళితీస్తే-చక్రవర్తి సతీసమేతంగా విచ్చేశాడు.

"రా రా నాన్నా! రా" ఆహ్వానించాను. "ఒసేయ్ రాజ్యం! చక్రవర్తి సుజాతా వచ్చారు. అవునూ పిల్లవాళ్ళేరిరా?" అన్నాను.

"మేం పిల్లలం గాదా?"

"నా ముఖం. మీ పిల్లలురా?"

"వాళ్ళు విశ్వం వాళ్ళింటికి వెళ్ళారు. టీవీలో ఏదో తెలుగు ఫైటింగ్ సినిమా వున్నదట."

"సరి—సరి. కూర్చోండి! రాజ్యం! వీళ్ళు మనింటికివచ్చి చాలా రోజు లయిందిగా- ఉల్లిపాయ పకోడీలు చేయి!" అన్నాను.

"అరేయ్! అన్యాయం. మేం వచ్చి పని పెట్టడం అంత భావ్యంగా లేదు. అమ్మాయ్ రాజ్యలక్ష్మి! శుభ్రంగా వంట ఇంటికి తాళం వేసి ఇలా వచ్చేయమ్మా కబుర్లు చెప్పుకుంటూ కూర్చుందాం."

"వద్దులే అన్నయ్యా! మీ బావగారికి నా కబుర్లకంటే వేడి వేడి పకోడీలంటేనే ఇష్టం!" అంటూ సుజాతను చేయి పట్టుకు తీసుకొని మరీ వంట ఇంట్లోకి వెళ్ళిపోయింది.

మాటల్లో పడ్డాం, నేనూ చక్రవర్తీ.

మొన్న సాయంత్రం వాళ్ళను-నడిరోడ్డు మీద చూసిన తీరు సంగతి ఎత్తి-నలుగురిలో నవ్వుల పాలు అవ్వద్దని హెచ్చరిద్దామా అని నాలుక చివరి దాకా వచ్చింది.

అయినా నా అంతటివాడు వాడు. వాడికి నేను చెప్పటమేమిటి-వాడిని

గురించి వాడే తెలుసుకోవాలిగాని- అని నన్ను నేనే తమాయించుకున్నాను.

"పేకాడదామా?" అన్నాడు పకోడీలు తింటూ.

"ఆఁ" అన్నట్లుగా నవ్వాను.

"లేదు రా బాబ్జీ! అన్నా చెల్లెళ్ళు ఒక పార్టీ. ఆడ్దాం!" అన్నాడు హుషారుగా చక్రవర్తి.

నాకు రాజ్యలక్ష్మి పేకాడటం- అందునా మొగవాళ్ళతో సమంగా కూర్చొని-మనస్కరించలేదు.

"వద్దులేరా బాబూ! ఇలాగే కబుర్లుచెప్పుకుంటూ కూర్చుందాం."

"అది గాదులే అన్నయ్యా! ఆయనగారికి నేను ఎన్నడూ వంట యింట్లో వంట చేస్తూ కూర్చుంటే నే అందంగా కనిపిస్తానట. వంట యింటి గడపదాటితే నా అందం ఎక్కడ తరిగిపోతుందోనని ఆయన గారి తాపత్రయం!"

నేను నోరు విప్పి ఏదో చెప్ప బోయేలోగా నే-గేటు తీసుకొని చేతిలో సూట్కేసులతో మా అమ్మా-నాన్న లోపల కాలు పెట్టారు.

పది నిముషాల తరువాత, "మేం వస్తాం యిక మరి!" అన్నాడు చక్రవర్తి.

"ఓ.కే. మీరు ఎలా వెళ్తారు యిప్పుడు?"

"వెళ్ళటానికేముందిగాని నీ సైకిల్ యివ్వు—రేపు ఆఫీసుకు వెళ్ళేలోగా తెస్తాను!"

"సైకిల్ మీద వెళ్తారా?"

"శుభ్రంగా. ఇదే ఢిల్లీలో అయితే మొగుడూ పెళ్ళామేగాదు, నలుగురు పిల్లల్ని, లారీడు సామాన్లనీ కూడా ఎక్కించి లాగించేస్తారు!"

నాకు తెలుసు—ఉద్యోగరీత్యా నాలుగు కాలాలు వాడు ఢిల్లీలో వున్నాడని. అదో తేనెటీగల పుట్ట. కదిలిస్తే కథల రూపంలో ఝుమ్మంటూ హోరు పెడతాయి.

సైకిలిచ్చి నమస్కారం పెట్టాను.

* * *

నాలుగు రోజుల తరువాత ఓ సాయంత్రం ఆఫీసు నుంచి రాగానే రాజ్యాన్ని చూస్తూనే కళ్ళు ఇంత చేసుకొని విచిత్రంగా-"ఏఁవిటి విశేషం-పేరంటమా?" అన్నాను.

"ఉఁహూఁ" అన్నది.

"చెప్పుదూ?"

"కాదనగూడదు మరి!"

"ఓ. కే."

"సినిమాకు వెళ్దాం!"

"ఇంట్లో అమ్మా నాన్న ఉండగానేనా?"

"సరే-వాళ్ళను కూడా రమ్మన మనండి. మన మధ్యలో కూర్చో బెట్టుకొని మహా సరదాగా సినిమా చూసేయవచ్చు!" అన్నది చుర కత్తిలా ఒక్కసారి నా మొఖం లోకి చూచి-చివరలు సర్దుకుంటున్న పొడువాటి జడను విసురుగా వెనక్కు వేసుకుంటూ.

అంతే కోప మొచ్చిం దన్న మాట!

కాఫీ త్రాగుతూ గదిలో ఎవ్వరూ లేకుండా చూచి-చేయి పట్టుకుని దగ్గరకు లాక్కొని, "నీకు కోప మొచ్చిందంటే వెళ్దాం!" అన్నాను.

"మరి యింత తయారయిన తరువాత వద్దు అంటే కోపం రాదా అమ్మా!" అన్నది బుంగమూతి పెట్టి.

"అమ్మా నాన్న ఏమను కుంటారు?"

"అత్తగారే అన్నది—రామి గాడిని ఇంట్లోనే వుంచుకుంటాను మనల్ని వెళ్ళమని!"

"అయ్యయ్యో! ఇదే మన్నా మర్యాదేనా?"

తీక్షణంగా నా కళ్ళల్లోకి ఒక్క సారి చూచి, "మర్యాదో అమర్యాదో. యాభై యేళ్ళ తాతయ్యలా మాట్లాడ బోకండి!" అని చివాలున నా చేయి వదిలించుకొని వంట యింట్లోకి వెళ్ళిపోయింది— "అత్తయ్యా! పండుకి పాలసీసాలో పాలు పోసి వుంచాను. వేణ్ణీళ్ళు కావాలంటే ఫ్లాస్కులో వున్నాయి!" అంటూ.

"సరి....సరి."

పావుగంట తరువాత యిద్దరం జంటగా బయటపడ్డాం.

"నడుద్దామా? రిక్షానా?"

"టాపు లేని రిక్షాలో అని అననుగాని రిక్షాలో వెళ్దాం పదండి. వచ్చేటప్పుడు హాయిగా నడవచ్చు!"

"చిత్తం దేవీ....మీరు ఆజ్ఞ లివ్వటం, మేం కాదనటమా?"

"పోదురూ బడాయి. నా మాట వింటూంటే నాకూ సరదాగా వుంటుంది."

"అదేనోయ్ నేనూ అంటూంట. ఈ సత్యం రాజ్యం గీసిన గీటు దాటడు అని నలుగురు చేత అనిపించుకోవటం నీకు సరదా!"

రిక్షా ఎక్కాం.

"ఇంతకీ ఏ సినిమా?"

"వేటగాడు."

"వచ్చి రెండు వందల రోజు లయింది."

"అందుకే."

"నేను నాల్గుసార్లు చూశాను."

"అందుకే."

"ఆ హాల్లో నల్లి లెక్కువ."

"అందుకే."

"అది ఇక్కడకు చాలా దూరాన ఉన్నది."

"అందుకే."

"ఇరవై రూపాయలు ఖర్చవు తుంది. తెలుసా?"

"అందుకే."

"ఖర్మ .... సరే పద."

ఇద్దరం ఆ హాలు ముందు రిక్షా దిగేవరకూ మాట్లాడుకోలేదు. రిక్షా వాడి చేతిలో కొత్త రెండు రూపా యల నోటును ఏడ్చుకుంటూ పెట్టి రాజ్యం వెనకాలే లోపలికి వెళ్ళాను.

"మూడు తీసుకుందాం."

"ఉఁహు-నాలుగున్నర బాక్సుకి వెళ్దాం."

నా నోరు నొక్కుకుపోయింది.

రెండు వందల రోజుల బట్టి ఆడుతున్న ఆ సినిమాకు, అక్కడో మనిషి ఇక్కడో మనిషి తిరుగు తున్న ఆ హాల్లోకి, డీలక్సు బాక్సుకి నాలుగున్నర టిక్కెట్టు—ఇద్దరికీ తొమ్మిది రూపాయలు పెట్టుకు వెళ్ళటమా? దీనికేమన్నా తిక్క రోగం పుట్టిందా?

అదే అందామన్నట్లుగా నోరు తెరిచేలోగానే, "ప్లీజ్! నా మాట కాదనవద్దు" అన్నది నా కళ్ళలోకే సూటిగా ఆశగా చూస్తూ.

నోరు మూసుకొని తీసు కున్నాను నసుక్కుంటూనే. అను కున్నట్లుగానే ఈ రోజున 20 రూపా యలు కృష్ణార్పణం.

లోపలికి వెళ్ళాం. డ్రస్ సర్కి ల్లోనే ఎవ్వరూ లేరు. డీలక్సులో ఇంకెవ్వరుంటారు? ఆ హాలు ఓనర్లమే మేం అన్నట్లుగా ఇద్దరం వెళ్ళి కుషన్సులో కూర్చున్నాం.

ఒక్కసారి కసిగా రాజ్యం ముఖంలోకి చూచాను. న్యూస్‌రీల్ మొదలెట్టారు- లైట్లార్పి.

డబ్బులు అనవసరంగా ఖర్చై పోయినాయి అనే బాధతో నా మన స్సంతా చికాగ్గా వున్నది. అందునా అప్పటికి నాలుగుసార్లు చూచాను ఆ సినిమాను.

అసలు సినిమా మొదలైంది.

ప్రతి ఫ్రేమూ....పాత ఫ్రేమే.

డైలాగులన్నీ కంఠస్తమే.

అనిజీగా వున్నది.

అయినా రాజేశ్వరి మాట కాదన లేను.

ఈ దేశంలో ప్రతి భర్తా నా లాగానే భార్య మాటను వినకుండా వుండలేడా? ఏఁవో!

హీరో హీరోయిన్లు ఎగురుతూ డ్యాన్సు చేస్తున్నారు.

రాజేశ్వరి నా నడుం చుట్టూ చేయి వేసింది.

నేను నలువైపులా మేం ఎవరి కైనా కనపడుతున్నామా అన్నట్లుగా

బిక్కు బిక్కుమని చూస్తుంటే నన్ను ఒక్క కుదుపుతో దగ్గరకు లాక్కొని పట్టుకుని ముద్దు పెట్టుకున్నది.

ఒక్క క్షణం తన్మయంగా కళ్ళు మూసుకున్నాను. జన్మలో అలాంటి తీయని ముద్దు నాకెన్నడూ అంతవరకూ లభించనట్లుగా. నిజమే! చాలా హాయిగా మత్తుగా నన్ను గింగిరాలు తిప్పేస్తోంది. చక్రవర్తి, సుజాత భుజం మీద నడిరోడ్డుమీద చేయి వేసుకు తిరిగిన దానికంటే కూడా చాలా చాలా బాగున్నదనిపిస్తోంది. *


# శ్రీ బాలాజీ వైద్యశాల

సెక్సు స్పెషలిస్టు **డా॥ పి. కుమారస్వామి దేవర**

హెడ్డాఫీసు:—5/1, బ్రాడీపేట, గుంటూరు-2 (ఎ.పి.)

బ్రాంచీలు: మార్వాడి గుడివద్ద, తెనాలి (ఎ.పి.)

ఫోన్: 551. 26, నార్త్ బోగ్ రోడ్, మద్రాస్-17.

## దీర్ఘవ్యాధులకు వుత్తమ వైద్యము



దురభ్యాసములకు లోనై దాంపత్య సుఖము పొందలేని వార్కి, (నిరుత్సాహముచే ప్రాణహాని చేసుకొనరాదు.) హెర్నియా, చర్మ వ్యాధులకు పోస్టు ద్వారా కూడా చేయబడును.

వరిబీజం (బుడ్డ), మూత్ర వ్యాధులకు ఇస్నోఫీలియా (దమ్ము), ఉబ్బసమునకు ఆపరేషన్ లేకుండా చేయబడును; స్వయంగా వచ్చి సంప్రదించవలెను.

NB: "శివలీల" తెలుగు పక్షపత్రిక అన్ని విషయములతో వెలువడుతుంది; చదవండి.

ఎడిటర్:- డా. పి. కుమారస్వామి దేవర,
గుంటూరు (ఎ.పి.)